క్లుప్తంగా

ఎర్రోళ్లకు రాజేశ్వర్‌రెడ్డి పరామర్శ



నివాళులర్పిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఇటీవల మృతి చెందారు. గంగాపూర్‌లోని ఆయన నివాసంలో స్వచ్ఛంద సంఘ సేవకుడు వంగ రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం పరామర్శించి ఓదార్చారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం



క్రీడాకారులను అభినందిస్తున్న ఎల్లంయాదవ్

సిద్దిపేటఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను కాంగ్రెస్ నాయకుడు పూర్ణిమఎల్లం యాదవ్ అభినందించారు. స్థానిక బాలికల కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, టీమ్ స్పిరిట్ పెరుగుతాయన్నారు. సిద్దిపేట నుంచి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక కావడం సంతోషించదగ్గ విషయమని ప్రశంసించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎంపికై సిద్దిపేటకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శిక్షకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి



ధన్వంతరి చిత్రపటం వద్ద నాయీబ్రాహ్మణులు

తొగుట(దుబ్బాక): మండల నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధన్వంతరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి మాట్లాడుతూ ధన్వంతరి సేవలు భావితరాలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు పయ్యావుల శ్రీనివాస్, నాయకులు హరీశ్, సాయి కిరణ్, అశోక్, వెంకటేశ్, అజయ్, శంకర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న స్నేహితులు

బెజ్జంకి(సిద్దిపేట): ఇటీవల ఒక రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న పారిశుద్ధ్య కార్మికురాలు బొనగిరి పోచవ్వకు శ్రీలక్ష్మీనర్సింహస్వామి గల్ఫ్ సేవా సమితి రూ.9 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆమె చికిత్స కోసం ఆదివారం అందజేసి నట్లు తెలిపారు. అలాగే మండలంలోని కల్లెపెల్లిలో ఇటీవల మృతి చెందిన దొంతి శ్రీకాంత్‌కు అతనితో పదో తరగతి చదువుకున్న స్నేహితులు ఆదివారం రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

సభ్యులకు అండగా నిలుస్తాం



డబ్బు అందజేస్తున్న పొదుపు సంఘం సభ్యులు

నంగునూరు(సిద్దిపేట): పురుషుల పొదుపు సంఘంలో చేరిన సభ్యులకు అప్పులు ఇవ్వడమే కాకుండా ఆపద సమయంలో వారిని ఆదుకుంటామని ఆ సంఘం మండలాధ్యక్షుడు కడారి తిరుపతిరెడ్డి చెప్పారు. నంగునూరుకు చెందిన జంగిటి నరసింహులు ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. అతడు గ్రామ పురుషుల పొదుపు సంఘం సభ్యుడు కావడంతో అభయ నిధి, సామూహిక నిధి, బోనస్ కలిపి మొత్తం రూ.88,635 ఆయన కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాస్, సత్యనారాయణ, మల్లేశం, రామచంద్రారెడ్డి, చంద్రప్రకాశ్, నర్సింగారావు తదితరులు పాల్గొన్నారు.

బాణాసంచా అమ్మకాల సందడి

స్తూపం వద్ద టపాసుల దుకాణాలు
- అన్ని షాపులు ఒకే చోట
- ప్రమిదలు, పువ్వులతో కళకళ





హుస్నాబాద్‌లో స్తూపం వద్ద ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాలు

హుస్నాబాద్: దీపావళి పండుగ సందర్భంగా పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద టపాసుల దుకాణాలకు అధికారులు అనుమతినిచ్చారు. జనావాస ప్రాంతాల్లో కాకుండా పట్టణ శివారులో ఈ సారి ఒకేచోట 15 దుకాణాలు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నీళ్లు నింపి ఉంచారు. పక్క పక్కనే దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే అన్ని దుకాణాలకు వ్యాపిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఒక దుకాణానికి మరో దుకాణానికి మధ్య కొంత గ్యాప్ ఉండాలని, అగ్ని ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు పర్యవేక్షించాలని కోరుతున్నారు. దుకాణాల వద్ద ఇసుక, వాటర్, ఫైర్ పరికరాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇసుక, ఫైర్ పరికరాలు కనపడటం లేదు.

మార్కెట్ కళకళ

దీపావళి పండుగ పురస్కరించుకొని మార్కెట్ పూజా సామగ్రితో కిటకిటలాడుతోంది. దీపావళి వచ్చిందంటే చిరు వ్యాపారులకు భలే గిరాకీ. ఇళ్లలోను, దుకాణాల్లోను లక్ష్మీపూజ, కేదారి, సత్యనారాయణ వ్రతాలు చేసుకొని పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. మట్టితో తయారు చేసిన తీరొక్క ప్రమిదలు, కుంకుమ, కంకణాల కొనుగోళ్లు జోరందుకున్నాయి. రోడ్లకు రెండువైపులా చిరు వ్యాపారులు బంతిపూలు అమ్మకాలు చేపట్టారు. మార్కెట్లో పూజలకు కావల్సిన సామగ్రి కొనుగోళ్ల సందడి నెలకొంది.



మార్కెట్‌లో పూజాసామగ్రి అమ్మకాలు



మట్టితో తయారు చేసిన తీరొక్క ప్రమిదలు

చైన్ స్నాచింగ్ కేసులో నలుగురు అరెస్టు

సిద్దిపేటకమాన్: చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు 48 గంటల్లోపు ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు దొంగలు, వారికి సహకరించిన మరో ఇద్దరితో కలిసి నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు ఆదివారం వివరాలు వెల్లడించారు. పట్టణంలోని భరత్‌నగర్‌కు చెందిన దంగేటి భవిత 17న ఉదయం కొమటి చెరువు వైపు వాకింగ్ వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా బైకుపై వచ్చిన ఇద్దరు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో పట్టణంలోని నాసర్‌పూరలో ఆదివారం ఉదయం ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారించగా వారు నేరం ఒప్పుకున్నారు. నిందితులు సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన సామల్ల బాలకిషన్, పూజం రాకేశ్‌గా గుర్తించారు. అయితే దొంగిలించిన చైన్‌ను విక్రయించడంలో వారికి సిరిసిల్లకు చెందిన మంగళారపు మాధవి సహకరించింది. ఆమె హైదరాబాద్ బహదూర్‌పుర కవాడిగూడకు చెందిన ఎండీ అఫ్జల్‌కు విక్రయించింది. దీంతో ముగ్గురు నిందితుల నుంచి రూ.1.60 లక్షలు, బైకు, రెండు సెల్ ఫోన్లతో పాటు ఎండీ అఫ్జల్ నుంచి బంగారు చైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

బోధనేతర పనుల అప్పగించొద్దు

టీఎస్ యూటీఎఫ్ మండల నేత రాజు



చేర్యాల(సిద్దిపేట): ఉపాధ్యాయులతో పాఠశాలల తనిఖీ వంటి బోధనేతర పనులు చేయించవద్దని, దానివల్ల విద్యార్థులు నష్టపోతున్నారని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల ప్రధాన కార్యదర్శి పిల్లి రాజు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా, మండల స్థాయిలో పాఠశాలల పర్యవేక్షణ కోసం డీఈఓ, ఎంఈఓ, కాంప్లెక్స్ హెచ్ఎం, ఎంఎన్ఓలు ఉండగా పాఠశాలల తనిఖీలకు ఉపాధ్యాయులను వినియోగించడం సరైన విధానం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా చేయడం వల్ల ఉపాధ్యాయులు బడికి దూరమై విద్యార్థులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని వాపోయారు. ఇప్పటికే ప్రైమరీ స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత ఉందని, చాలా మందికి డిప్యుటేషన్ వేయడంతో విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన చెందారు. వెంటనే పర్యవేక్షణ టీంలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శలు

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జిల్లాలోని పలువురి బాధిత కుటుంబాలను ఆదివారం పరామర్శించారు.



గౌరారంలో బాల్‌రెడ్డి, విష్ణును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

వర్గల్(గజ్వేల్)/గజ్వేల్/కొండపాక(గజ్వేల్)/చిన్నకోడూరు(సిద్దిపేట)/నంగునూరు(సిద్దిపేట): ఇటీవల పితృవియోగానికి గురైన వర్గల్ మాజీ ఎంపీపీ జాలిగామ లతరమేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ కడపల బాల్‌రెడ్డిని హరీశ్‌రావు పరామర్శించారు. గౌరారంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు భూంరెడ్డి వెంకట్‌రెడ్డి ఇటీవల మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. వర్గల్ క్రాస్‌రోడ్డు వద్ద ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్‌లోని అవుసులోనిపల్లి, నగరంతండా తదితర గ్రామాల భూనిర్వాసిత రైతులు ఆయనను కలిశారు. పంటకాలం ముగిసే వరకు పొలాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరింపజేయాలని వినతిపత్రం అందజేశారు. అలాగే గజ్వేల్‌లోని ఏటిగడ్డకిష్టాపూర్ మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ స్వామిని ఓదార్చారు. ఆయన వెంట గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, బీఆర్ఎస్ పట్టణశాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా తదితరులు పాల్గొన్నారు. అనంతరం కుకునూరుపల్లిలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన విద్యార్థిని మేఘన కుటుంబ సభ్యులను ఓదార్చారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, అనంతుల నరేందర్, హైమద్, సంపత్ తదితరులు పాల్గొన్నా రు. చిన్నకోడూరు మండల పరిధిలోని ఎల్లాయపల్లి మాజీ సర్పంచ్ మహేందర్‌ను ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి పరామర్శించారు. అలాగే గంగాపూర్‌లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి దశ, దిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. నంగునూరు పాఠశాలలో ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విద్యార్థి వివేక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు.

నూతన నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ఆటో యూనియన్ అధ్యక్షుడిగా బొనగం శ్రీనివాస్‌గౌడ్‌ను ఆదివారం యూనియన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏఐసీసీ మైనారిటీ అబ్జర్వర్‌గా మాలిక్



మజార్ మాలిక్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జూబ్లీ హిల్స్ ఉప ఉన్నికకు ఏఐసీసీ మైనార్టీ అబ్జర్వర్‌గా తనను నియమించినట్లు, డీసీసీ మైనార్టీ చైర్మన్ మజార్ మాలిక్ ఆదివారం తెలిపారు. ఏఐసీసీ మైనార్టీ డిపార్ట్‌మెంట్ చైర్మన్, రాజ్యసభ ఎంపీ ఇమ్రాన్ నియామక పత్రం అందించినట్లు తెలిపారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపు కోసం కృషి చేయనున్నట్లు ఆయన చెప్పారు.

అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలి: బీసీ జేఏసీ నేతలు

గజ్వేల్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఏర్పాటు చేసి, ప్రధాని మోదీ వద్దకు తీసుకువెళ్ళాలని గజ్వేల్ బీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం గజ్వేల్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ బీసీ జేఏసీ ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు సహకరించిన ప్రజలకు, వ్యాపార, వాణిజ్య సంస్థలకు, అధికారులకు బీసీ జేఏసీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీలను 9వ షెడ్యూల్‌లో చేర్చి, ఆ బిల్లును ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు జరిగే విధంగా అన్ని పార్టీలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణను రూపొందించి బీసీలకు 42 శాతం రిజర్వేష న్లు అమలయ్యే వరకు పోరాటాలు కొనసాగిస్తా మని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కల్యాణ్‌కర్ నర్సింగరావు, శ్రీను, ఎల్లయ్య, రమణాకర్, స్వామిచారి, వినోద్ పాల్గొన్నారు.

నేరస్తుడిని కఠినంగా శిక్షించాలి

రేగోడ్(మెదక్): నిజామాబాద్‌లో ఓ కానిస్టేబుల్‌పై దాడిచేసి హత్య చేసిన పాత నేరస్తుడిని కఠినంగా శిక్షించాలని పోచారం బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బాలయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కానిస్టేబుల్‌ను చంపుతున్నా ఎవరూ స్పందించకపోవడం దారుణమన్నారు.

నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు

గజ్వేల్ ఏసీపీ నరసింహులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏసీపీ నరసింహులు

గజ్వేల్‌రూరల్: ఉపాధి నైపుణ్య శిక్షణతో యువత స్వయం ఉపాధి పొందవచ్చని ఏసీపీ నరసింహులు పిలుపునిచ్చారు. సెట్విన్‌లో రాయితీపై నిర్వహిస్తున్న ఉపాధి నైపుణ్య శిక్షణకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు వృత్తి నైపుణ్య శిక్షణలో మెళకువలు నేర్చుకోవాలన్నారు. సెట్విన్ ఇన్‌చార్జి ఎంఏ ఖదీర్ మాట్లాడుతూ పట్టణంలోని కోటమైసమ్మ దేవాలయ సమీపంలోని సెట్విన్ కేంద్రంలో 10వ తరగతి ఉత్తీర్ణులైన యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణ ప్రారంభించామన్నారు. ఆరు నెలల కాలపరిమితితో టీచర్ ట్రెనింగ్(పీపీటీసీ), మూడు నెలల కాలపరిమితితో ఎంఎస్ ఆఫీస్, డీటీపీ నేర్పిస్తామని చెప్పారు. అదే విధంగా విద్యార్హతతో సంబంధం లేకుండా మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ, మగ్గం వర్క్, మెహందీ, బ్యూటీషియన్, ఫ్రిజ్, ఏసీ రిపేర్ లాంటి వాటిలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. దీపావళి పర్వదినం సందర్భంగా నామమాత్రపు రుసుములోనే 25 శాతం రాయితీ కల్పించామని, ఆసక్తిగల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కష్టపడి సాధించిన విజయాలే స్ఫూర్తి



అఖిల్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

రిటైర్డు గెజిటెడ్ హెచ్ఎం బాలనరసయ్య

కొండపాక(గజ్వేల్): ప్రణాళిక, పట్టుదల, విశ్వాసంతో కృషిచేసి సాధించిన విజయాలు యువతకు స్ఫూర్తిగా నిలవాలని రిటైర్డు గెజిటెడ్ హెచ్ఎం బాలనరసయ్య ఆకాంక్షించారు. మండలంలోని బందారం గ్రామానికి చెందిన నర్ర అఖిల్‌రెడ్డి గ్రూప్ వన్ ఉద్యోగ నియామకాల్లో డీఎస్పీగా ఎంపికవ్వడంతో 'మనం మన ఊరు' ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హైస్కూల్లో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలనరసయ్య మాట్లాడారు. గ్రూప్ వన్ ఉద్యోగం సంపాదించడానికి కష్టపడిన అఖిల్‌రెడ్డిని గ్రామ యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తాత్కాలిక ఆనందాలు, సౌకర్యాలకులోనై భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని సూచించారు. ఏ ప్రభుత్వ ఉద్యోగంలో చేరినా ప్రజల పక్షాన నిలబడాలని కోరారు. ప్రముఖ కవి నందిని సిధారెడ్డి మాట్లాడుతూ అఖిల్‌రెడ్డి మరింత ఉన్నత హోదాలకు చేరుకోవాలని, గ్రామానికి మంచి పేరు వచ్చేలా కృషి చేయాలని ఆకాక్షించారు. అనంతరం అఖిల్‌రెడ్డి దంపతులను మెమెంటో, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 'మనం మన ఊరు' ఉద్యోగుల సంఘం నాయకులు మధుసూదన్‌రెడ్డి, రాజాగౌడ్, రాజిరెడ్డి, మల్లారెడ్డి, దేవేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తుకారాం, పోశాద్రి, భగవాన్‌రెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి రైతులు మద్దతు ధర కల్పించాలని పాలమాకుల పీఏసీఎస్ చైర్మన్ ఎల్లంకి మహిపాల్‌రెడ్డి సూచించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నర్మేట, కోనాయిపల్లి, తిమ్మాయిపల్లి, మైసంపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మల్లయ్య, రాజిరెడ్డి, బాబు, వెంకటేశం, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రాంభిస్తున్న మహిపాల్‌డ్డి

స్వచ్ఛందంగా చెట్ల తొలగింపు

- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు
- స్వయంగా రంగంలోకి దిగిన యువకులు



మూలమలుపుల్లోని చెట్లను తొలగిస్తున్న యువత

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలంలోని గాంధీనగర్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న చెట్లను యువకులు తొలగించారు. హుస్నాబాద్ నుంచి అక్కన్నపేట వెళ్లే రోడ్డు మూల మలుపుల వద్ద చెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో వాహనాదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని, స్వచ్ఛందంగా తామే చెట్లను తొలగించామని యువకులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు నీలం కుమార్, అనిల్, బోజ అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసినవారిపై చర్యలేవి?



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఫాంహౌస్‌పై దాడి చేసిన వారిపై చర్యలేవని బీఆర్ఎస్ నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బెజ్జంకి సత్యార్జున ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులు దాడి చేశారని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అభివృద్ధి పనులు విస్మరించి అనుచిత వ్యాఖ్యలు, దాడులు చేస్తున్నారని ఆరోపించారు. దాడికి పాల్పడ్డ వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కూడవెల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

దుబ్బాక: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన భూంపల్లి–అక్బర్‌పేట మండలం కూడవెల్లి రామలింగేశ్వర ఆలయంలో దీపావళి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయం ప్రధాన అర్చకుడు సాకేత్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో రామలింగేశ్వర స్వామితో పాటు ప్రధాన దేవతా మూర్తులను అందంగా అలంకరించి అభిషేకాలు చేశారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

కానరాని నాణ్యతా ప్రమాణాలు

ఒక్కరోజులోనే రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాల డొల్లతనం బయటపడింది. నిన్న బీటీ రోడ్డు వేయగా మరునటి రోజునే రోడ్డంతా కంకర తేలి ఎక్కడికక్కడ పెచ్చుల్లా ఊడిపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డు నిర్మాణంలో డొల్లతనం
- ఊడిపోతున్న డాంబర్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు





ఊడిపోతున్న రోడ్డును చూపిస్తున్న వీరాచారి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లిలో డబుల్ రోడ్డు నిర్మాణ పనుల దుస్థితి ఇలా ఉంది. హుస్నాబాద్ మల్లెచెట్టు చౌరస్తా నుంచి రామవరం వరకు దాదాపు 11కిలో మీటర్ల మేరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.25 కోట్ల నిధులు మంజూరు చేసింది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కొన్ని రోజులుగా డబుల్ రోడ్డు విస్తరణ పనులు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో మూడు రోజుల గౌరవెల్లిలో డాంబర్ పరిచారు. అయితే పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడంలేదని గ్రామానికి చెందిన గొల్లపెల్లి వీరాచారి ఆరోపించారు. రోడ్డంతా పెచ్చుల్లా ఊడిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గ్రామంలో దాదాపుగా 15గజాల వరకు మరలా డాంబర్ పోసినట్లు చెప్పారు. అలాగే కంకర మిక్సింగ్ సరిగా చేయకపోవడంతోనే బీటీ రోడ్డు పోసిన వెంటనే పెచ్చుల్లా ఊడిపోతుందని వాపోయారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీఏఈ రాహుల్‌ను సాక్షి సంప్రదించగా నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలోనే బీటీ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తామని చెప్పారు.

టపాసులు కాల్చేటప్పుడు అప్రమత్తం

హేమరాజ్‌సింగ్, దుబ్బాక ఆస్పత్రి సూపరింటెండెంట్



దుబ్బాక: దీపావళి పండుగ అందరిలో ఆనందంలో నింపాలే తప్పా విషాదం కాకుడదని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్ అన్నారు. ఆస్పత్రిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాణసంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. టపాసులు కాల్చేసమయంలో దూరంగా ఉండాలని, చిన్న పిల్లలను సాధ్యమైనంత వరకు దూరంగా ఉంచాలని చెప్పారు. కాటన్ దుస్తులు ధరించాలని, ప్రమాదం జరిగితే వెంటనే 108కు సమాచారం అందించి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు రావాలని సూచించారు. చికిత్స అందించేందుకు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉంటారని చెప్పారు. ప్రతి ఒక్కరు దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.